క్లుప్తంగా

ఉత్తర ముఖద్వారం ప్రారంభం



పెన్నహోబిలంలో ఉత్తర ముఖద్వారం ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఉత్తర ముఖద్వారాన్ని ఈఓ కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఓబిరెడ్డి, నారప రెడ్డి లక్ష్మీనరసింహస్వామి మొక్కుబడిగా రూ.12 లక్షలు వ్యయంతో నిర్మించిన ఆలయ దక్షిణ ముఖద్వారానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, యువజన నాయకులు భీమిరెడ్డి, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, నీలప్ప తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

కళ్యాణదుర్గం: స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జేకేసీలో బుధవారం నవభారత్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాలలో జరిగిన జాబ్‌మేళాకు 26 మంది హాజరుకాగా అందులో 11 మంది అభ్యర్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి, జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ మహేంద్రరావు అభినందించారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం (బోరంపల్లి) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2023 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. బుధవారం 28,001 నుంచి 43,000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ చేపట్టారు. 1వ తేదీ 43,001 నుంచి 58,000 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్ కుమార్ తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్‌లను తీసుకురావాలన్నారు.

ఘనంగా హీరో కృష్ణ జయంతి

కళ్యాణదుర్గం: స్థానిక వాల్మీకి సర్కిల్‌లో బుధవారం సినీ హీరో సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు పూజారి చిన్న నాగప్ప, శ్రీరాములు, వినియోగదారుల సంఘం నాయకులు చల్లా కిశోర్, లింగ ప్రసాద్, మురళీధర్, రోజ్లీ రాజేష్, బిక్కి గోవింద్, గోళ్ల మునీర్‌ఖాన్, వెంకటేష్ తదితరులు కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘనంగా కనకదాస విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న విప్ కాపు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని నాగలాపురంలో బుధవారం కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు.ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై కనకదాస విగ్రహానికి పూలమాలు వేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. విప్ మాట్లాడుతూ కనకదాస సేవలు చిరస్మరణీయమన్నారు. ఆ మహాను బావుడి అడుగు జాడుల్లోనే నడుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కురుబలు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటనాయుడు

బ్రహ్మసముద్రం: లబ్ధిదారుల ఇంటిముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం వారు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజుతో కలిసి వలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శెట్టిగారి మంజునాథ్, అశోక్‌రెడ్డి, ఏఓ నందకిశోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం లక్ష్యం

- 'గడప గడప'లో
ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



గోవిందవాడలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోవిందవాడ-1 గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటం చేస్తూ అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అర్హతే ప్రామాణికంగా భావించి సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ఆదరించాలన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియా, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ప్రభుత్వ పథకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 600 అబద్ధపు హామీలను ఇచ్చి ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో నీరు-చెట్టు కార్యక్రమం చేపట్టి ప్రజాధనాన్ని దోచేశారన్నారు. మళ్లీ దొంగ హామీలను ప్రకటిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు నమ్మరని, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు ఆదరిస్తారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సైతం ప్రభుత్వం పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద ప్రజలు, గ్రామాల అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భోగన్‌గౌడ్, ఈఓపీఆర్‌డీ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వన్నూరుస్వామి, నాయకులు గురురాజ్‌గౌడ్, తిప్పేస్వామి, జేబీ మల్లికార్జున, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, జయరామ్ రెడ్డి, వన్నూరుస్వామి, వన్నల్లి రామాంజనేయులు, ఆనంద్‌రెడ్డి, సుధాకర్, రాజశేఖర్, నుంకేష్, వీరన్నగౌడ్, జి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిని వివరించండి



పాలవాయిలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి అందించిన నవరత్న పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని కొత్తూరు, బోయలపల్లి, పాలవాయి, చాపిరి, హులికల్లు, బోరంపల్లి గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న 'నాడు- నేడు' అభివృద్ధి పనులు, సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అమలుచేయని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికి మాత్రమే పథకాలు అందేవని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థతో రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలకు , కార్యకర్తలకు సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమ పాలనకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని చెప్పారు. మంత్రి వెంట జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, సచివాలయాల మండల కన్వీనర్ భట్టువానిపల్లి అంజి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కాంతమ్మ, సర్పంచులు నాగమణి, దురగమ్మ, నాగరత్నమ్మ, హనుమంతప్ప, శోభారాణి, ఎంపీటీసీలు లింగమ్మ, హనుమంతరెడ్డి, నాయకులు బాబు, గంగప్ప, నారాయణరెడ్డి, మల్లన్న, మల్లికార్జున, జైపాల్‌రెడ్డి, హనుమంతరాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల నీటి సంపులో పడి మృతి చెందిన చాపిరికి వైఎస్సార్‌సీపీ నాయకుడు అర్జున్ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభం



పార్టీ కార్యాలయంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: స్థానిక వీరశైవ నగర్‌లో ఆధునీకరించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన సతీమణి భువనేశ్వరి, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి సర్వమత ప్రార్థనలు నిర్వహించి కార్యాలయంలోకి ప్రవేశించారు. వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించిన అనంతరం ముస్లిం మత పెద్దలు దువా చేశారు. అనంతరం చర్చి ఫాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి మాజీ ఎమ్మెల్యే విశ్వ రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి జై జగన్..వైఎస్సార్ అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

'దుర్గం'లో కుండపోత వర్షం



మృతి చెందిన కోళ్లను చూపుతున్న రైతు నాగరాజు

రాయదుర్గంటౌన్: పట్టణంలో బుధవారం సాయంత్రం గంటపాటు ఉరుములు, మెరుపులతో కొండపోత వర్షం కురిసింది. వర్షంతోపాటు గాలి తీవ్రత అధికంగా ఉండడంతో దాదాపు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. కొలిమివీధి, రామస్వామి వీధి, మీ సేవా ఏరియా, కేబీ ప్యాలెస్ రోడ్డు సర్కిల్‌లో మోకాళ్ల దాకా వర్షపునీరు పారింది. ముఖ్యంగా కొండప్రాంతం నుంచి ప్రధాన కాలవలో భారీ స్థాయిలో వరదనీరు రావడంతో లోతట్టు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపార్లాయి. వర్షం ఆగిన వెంటనే సచివాలయ సిబ్బంది, శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి కాలువల్లో కొట్టుకొచ్చిన పూడిక, వేస్ట్‌ను తొలగించేలా చర్యలు చేపట్టారు. కాగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాలతో ఇటీవల వారంరోజుల నుంచి కేబీ ప్యాలెస్ రోడ్డు వద్ద నుంచి పుట్టప్ప తోట వరకు చేపడుతున్న పూడిక తీత పనులు సత్ఫలితాన్నిచ్చాయి. పూడిక తీత స్పెషల్ డ్రైవ్ కారణంగా కేవలం గంటర్నర వ్యవధిలోనే నీరు తగ్గిందని పలుకాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

పిడుగు పాటుకు 10 గొర్రెలు మృతి

గుమ్మఘట్ట: మండలంలోని దేవరెడ్డిపల్లి సమీపంలో బుధవారం పిడుగుపాటుకు 8 గొర్రెలు, రెండు మేకలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన గొల్ల పరమేశ్వరకు చెందిన 250 గొర్రెలు, మేకలను బుధవారం ఉదయం మేపునకు సమీపంలోని అటవీ ప్రాంతానికి కాపరులు ఎర్రిస్వామి, నరేష్, రామకృష్ణ, శ్రీధర్, శేఖర్, వెంకటేశులు తోలుకెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో తూర్పుగడ్డ వద్ద చెట్ల కిందకు జీవాలు చేరుకున్నాయి. ఆ సమయంలో ఓ చెట్టు మీద పిడుగు రాలడంతో దాని కింద ఉన్న 8 గొర్రెలు, రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ.1.20 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

పిడుగు పాటుకు కోళ్ల మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని రాయంపల్లిలో బుధవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురవడంతో కోళ్ల షెడ్డు రేకులు ఎగిసిపడ్డాయి. అదే సమయంలో పిడుగు పడడంతో సుమారు వంద కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కుమ్మరి నాగరాజు తెలిపారు.

అమృత్ సరోవర్ పనులు వేగవంతం చేయండి

కణేకల్లు: మిషన్ అమృత్ సరోవర్ కింద నిర్వహించ తలపెట్టిన పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ మిషన్ అమృత్ సరోవర్ కింద పెనకలపాడు, పూలచెర్ల చెరువుల్లో పూడికతీత పనులకు ప్రతిపాదన పంపామన్నారు. వర్షాలొచ్చేలోపు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే ఉపాధి పనులకొచ్చే కూలీల సంఖ్య పెంచాలన్నారు. పండ్లతోట పెంపకానికి ప్రభుత్వం అనేక రాయితీలిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఓఆర్‌డీ గూడెన్న, ఈసీ వెంకటరమణ, టీఏలు సోమన్నగౌడ్, నరసింహాచారి, ఆదినారాయణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

కళ్యాణదుర్గం: త్రైత సిద్ధాంతంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని త్రైత సిద్ధాతం- ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదికకు చెందిన ఏనుగుమర్రి, మద్దిగట్ల కమిటీ సభ్యులు తెలిపారు. తమ పర్యటనలో భాగంగా బుధవారం కళ్యాణదుర్గంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కమిటీల అధ్యక్షులు మోహన్‌కృష్ణ, రాఘవేంద్ర, సభ్యులు మల్లేశ్వరయ్య, పెద్ద యోగేష్, శివకుమార్, నారాయణస్వామి, వరప్రసాద్, మధు, అంకిత, లక్ష్మీ, వెంకటమ్మ, సిరి, మౌనిక, అనిష పాల్గొన్నారు.

శేషప్ప ఆలయంలో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని చాకలివీధిలో ఉన్న శేషప్ప ఆలయంలో హుండీ కానుకలు చోరీకి గురయ్యాయి. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. దుండగులు ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు, కానుకలను దోచుకెళ్లారు. తెల్లవారుజామున పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు గుర్తించి చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీచరణ్

కంబదూరు: నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవడమే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీ చరణ్ అన్నారు. ఆయన బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేశారన్నారు. టీడీపీ నేత చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో అబద్దాల పుట్ట అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన నూతిమడుగు, కర్తనపర్తి, రాళ్ల అనంతపురం, చెన్నంపల్లి, కురాకులపల్లి, కంబదూరు గ్రామ పంచాయతీల్లో సుడిగాలి పర్యటన చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిందప్ప, నీలి శంకరప్ప, పార్టీ మండల కన్వీనర్ బాలరాజు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామమోహన్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీపీ భీమేశ్, సర్పంచులు రాజగోపాల్, శివ, అమర్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ



గుమ్మఘట్ట: వేరుశనగ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఇతర ప్రజాప్రతినిధులు

రాయదుర్గం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేరైతులకు ప్రభుత్వం సబ్సిడీ ధరతో అందించే విత్తన వేరుశనగను మండలంలోని మలకాపురం గ్రామంలో ఎంపీపీ విద్యావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు నాగరాజు, గోపాల్, గోవిందప్ప, ఎర్రిస్వామి, ఎంపీఈఓ నాగరాజు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, రంగచేడు ఆర్బీకేల్లో బుధవారం రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీటీసీ సభ్యురాలు మారెక్క, పీఏసీఎస్ అధ్యక్షుడు బాబు, వీసీ కమిటీ చైర్మన్ మల్లికార్జున, నాయకులు సూరయ్య, బొమ్మేష్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ మంత్రంతో సకల శుభాలు



మాట్లాడుతున్న డాక్టర్ జగర్లపూడి శ్యామ సుందర శాస్త్రి

కళ్యాణదుర్గం: గాయత్రీ మంత్రంతో సకల శుభాలు కలుగుతాయని ఆకాశవాణి వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామ సుందర శాస్త్రి భక్తులకు వివరించారు. గాయత్రీ అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన భక్తులకు ప్రవచనాలు చేశారు. గాయత్రీ మంత్రాన్ని వింటూ, జపిస్తూ ఉంటే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ నిర్వాహకులు జయం పురుషోత్తం, గంగారపు రామ ప్రసాద్, రాఘవేంద్ర, గాధంశెట్టి ప్రసాద్, సీఎం శివ ప్రకాష్, తాయి మురళి, సత్యనారాయణ సత్కరించారు.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్!

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు పోలీసులపై ఓవరాక్షన్‌కు దిగారు. బుధవారం టీ సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గం నాయకులు ఆర్జీ శివశంకర్, చౌళం మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి తదితరులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసేందుకు వచ్చారు. అనుమతి లేకుండా కార్యక్రమం నిర్వహిస్తుండటంతో అక్కడి నుంచి వెళ్లిపోవాలని పట్టణ సీఐ తేజమూర్తి టీడీపీ నేతలకు సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు పబ్లిక్‌కు ఇబ్బంది లేకుండా పార్టీ కార్యాలయాల్లో చేసుకోవాలన్నారు. అయితే తాము ఇక్కడే కార్యక్రమం చేసి తీరుతామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నేతల నిర్వాకంతో సామాన్య ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ఉచిత పథకాలను ఇస్తూ పోతే రాబోవు రోజుల్లో మరో శ్రీలంక అవుతుందని విమర్శించిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ఇప్పుడు టీడీపీ ప్రకటించిన ఉచిత మేనిఫెస్టో బాగుందని సంబరాలు చేసుకోవడం ఏంటని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

వజ్రకరూరు: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ అని ల్‌కుమార్ సూచించారు.బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అస్సైన్ మెంట్‌ను రీవెరిఫికేషన్ చేయాలని, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పర్యటించారు. మొదటి వార్డులో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. సర్పంచు మోనాలిసా, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, వీఆర్వో అరుణ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం

కూడేరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ముగ్గురు కానిస్టేబుళ్లు ప్రభు(అనంతపురం 3 టౌన్), రామకృష్ణ(కాళ్యాణదుర్గం టౌన్), అశోక్(కళ్యాణదుర్గం టౌన్) బదిలీ అయ్యారు. బుధవారం రాత్రి కూడేరు పోలీసు స్టేషన్‌లో వారికి ఎస్‌ఐ సత్యనారాయణ శాలువా కప్పి, పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలపై నిఘా ఉంచండి

కూడేరు: వేసవిలో పిల్లలు ఈత కోసం బావులు , చెరువులు , చెక్‌డ్యాంల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. మండలంలోని గొటుకూరు వద్ద ఉన్న చెక్‌డ్యాంలో మంగళవారం అనంతపురానికి చెందిన వంశీ అనే యువకుడు ఈతకు వచ్చి నీటిలో మునిగి మృతి చెందిన విషయం విదితమే. బుధవారం గొటుకూరుకు చెందిన యువకులు చెక్ డ్యాం వద్దకు పిల్లలు వెళ్లకుండా కంప చెట్లు కొట్టి అడ్డంగా వేశారు. చెక్ డ్యాం గోడకు సరదా కోసం ఈతకు వెళ్లి మృత్యువాత పడొద్దు అని పెయింట్‌తో హెచ్చరికగా రాశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అక్కడికి వెళ్లి ఆ యువకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. బావులు, చెరువులు, చెక్‌డ్యాంలు వద్దకు వెళ్లవద్దని హెచ్చరించాలని సూచించారు.

రైతు ఆత్మహత్య



మల్లికార్జున(ఫైల్)

కూడేరు: మండలంలోని జయపురానికి చెందిన రైతు మల్లికార్జున(32) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా..ఆయన నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పంట పెట్టుబడుల కోసం రూ.10 లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పు తీరే మార్గం కానరాక మనస్థాపంతో మంగళవారం తన పొలంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు అతడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అతడికి భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దూమపానం, మద్యపానం నియంత్రిద్దాం



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న జడ్జి సుభాన్



బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కళ్యాణదుర్గం/కుందుర్పి/బ్రహ్మసముద్రం/బొమ్మనహాళ్: ధూమపానం, మద్యపానం తదితర మత్తు పదార్థాలను నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కళ్యాణదుర్గంలోని కోర్టు ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులతో కలిసి జడ్జి మాట్లాడారు. గుట్కా, పాన్, సిగరెట్, బీడీ వంటి మత్తు పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో వాడడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మద్య పానం, దూమపానం నియంత్రించడానికి కలిసికట్టుగా ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ దేవేంద్రప్ప, న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, పరిపూర్ణదేవి, క్రిష్ణమూర్తి, దాదా ఖలందర్, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

- కుందుర్పి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు అనూష, చాంద్ బేగాం ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రంగస్వామి, శశికళ, నరసింహ రావు, జ్ఞాన ప్రకాష్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
- బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, సీహెచ్‌ఓ బాలజీ, లాబ అసిస్టెంట్ పవన్ , ఫార్మాసిస్ట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, లింగదహాళ్, తారకాపురం గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కుమార రాజా, గీతాభార్గవి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, గోవర్ధన, వెంకటరమణ, అలివేలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన మరమ్మతులపై 5 నుంచి శిక్షణ

కళ్యాణదుర్గం: ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో నిరుద్యోగ యువతకు ద్విచక్ర వాహనం మరమ్మతులపై శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 5-10వ తరగతి, ఇంటర్, ఐటీఐ చదివి, 18-35 ఏళ్ల వయస్సులోపు వారు అర్హులన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, మధ్యాహ్నం భోజనం వసతి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికీ ఉచితంగా టూల్ కిట్‌తో పాటు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 5 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, వివరాలకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, దొడగట్ట రోడ్, పాత ఆర్డీటీ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కోసం 6303580397, 9959422884 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

దేశాభివృద్ధిలో

విద్యార్థుల పాత్ర కీలకం

రాయదుర్గం రూరల్: రాష్ట్రంతో పాటు దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని ఇంటర్నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ సెల్ (ఐక్యూ ఏసీ) కో ఆర్డినేటర్ జేఎస్ ఫర్వీన్ అన్నారు. స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గ్రేడ్ సాధించే దిశగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె న్యాక్ సందర్శనలో విద్యార్థుల భాగస్వామ్యం గురించి వివరించారు. టీమ్ స్పిరిట్‌తో పనిచేసే యాడ్ ఆన్ కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వజ్రకరూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి మునెమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పొందాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే బుక్ రీడింగ్, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్ ఆడడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ మహబూబ్‌బాషా, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.